క్లుప్తంగా

విద్యుత్ వినియోగంపై అవగాహన ర్యాలీ

సారవకోట: విద్యుత్ వినియోగంపై అవగాహన ర్యాలీని మండల కేంద్రంలో శనివారం చేపట్టారు. విద్యుత్ శాఖ ఏఈఈ రమేష్ కరెంటును వాడేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఈ పి.శ్రీనివాస్, ఎల్ఐలు నరసింహులు, ఉపేంద్ర, సచివాలయ జేఎల్ఎంలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ పీవోగా రమేష్‌సాహు


రమేష్‌సాహు

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా కళాశాలకు చెందిన జంతుశాస్త్ర అధ్యాపకుడు రమేష్‌సాహు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు శనివారం తెలిపారు. ఈమేరకు అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ద్వారా అధికారిక ఉత్తర్వులు విడులైనట్లు వెల్లడించారు. ఉపాధ్యాయ సిబ్బంది రమేష్‌సాహును అభినందించారు.

కిడ్నీ రోగికి పింఛన్ అందజేసిన ఎమ్మెల్యే


పాతపట్నం: జ్యోతికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ఎగువ కంద్రవీధికి చెందిన కొర్రాయి జ్యోతి కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. ఈమె డయాలసిస్ రోగి కావడంతో రూ. పది వేలు పింఛన్ మంజూరైంది. ఈ మొత్తాన్ని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జ్యోతికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కె.అర్జునుడు, ఎం.తాతయ్యలు, కర్రి లక్ష్మీనారాయణ, సచివాలయ ఉద్యోగి త్రివేణి, వలంటీర్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ అందజేసి..


మహాలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భవాని

కొత్తూరు: కొత్తపానుటూరు గ్రామానికి చెందిన కుమ్మరి మహాలక్ష్మి అనారోగ్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. దీంతో ఈ నెలకు ఆమెకు మంజూరైన వితంతు పింఛన్‌ను 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న జెమ్స్ ఆస్పత్రికి వలంటీర్ నాసరి భవాని శనివారం వెళ్లి అందజేశారు.

రేషన్ డీలర్ల సంఘం జాయింట్ సెక్రటరీగా రవికుమార్



ఆమదాలవలస: రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఆమదాలవలసకు చెందిన బొడ్డేపల్లి రవికుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకట్రావు నుంచి శనివారం ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రవికుమార్ సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీలో చోటుకల్పించారు.

'సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి'


మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు సూచించారు. పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో మండల కేంద్రంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు ప్రతిఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం–ఆంధ్రా'కార్యక్రమంలో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో పాల్గొనేలా కృషి చేయాలని చెప్పారు. నాయకులు లోతుగెడ్డ తాతబాబు, కొయిలాపు సంజీవరావు, అగతమూడి రంజిత్, వలురౌతు ఆఫీస్, బిల్లింగు సంజీవరావు, పడాల వెంకటకృష్ణ, సింహాద్రి నాయుడు, నాగేశ్వరరావు, కొండాన రామకృష్ణ, కూన అర్జున్ పాల్గొన్నారు.

రైతన్నకు 'మిచాంగ్' గుబులు!

సరుబుజ్జిలి/హిరమండలం: రైతులను 'మిచాంగ్' తుపాను గుబులు వెంటాడుతోంది. కొద్ది రోజుల్లో వరిపంట చేతికి వస్తున్న దశలో తుపాను హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నారు. దీంతో వరి కోతలు పూర్తి చేసిన రైతులు ఆదరాబాదరగా కుప్పలు పెట్టే పనిలో బిజీ అయ్యారు. అలాగే నూర్పులు పూర్తన ధాన్యాన్ని కళ్లాల నుంచి బస్తాల్లో నింపి భద్రంగా ఉండే చోట్లకు తరలిస్తున్నారు.


సరుబుజ్జిలి: కొత్తకోట వద్ద కుప్పలు పెడుతున్న రైతులు

కోతలు వాయిదా వేసుకోవాలి

మెళియాపుట్టి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ సరోజిని, వ్యవసాయ శాఖ అధికారి దానకర్ణుడు సూచించారు. వారు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. ఇప్పటికే కోసిన వరిని టార్పాలిన్లతో సంరక్షించుకోవడం, లేదా సురక్షిత ప్రాంతాలలో నిల్వచేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కళ్లల్లోని వరికుప్పలను పరిశీలించారు. వీఏఏ శరత్, జయలక్ష్మి ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జలుమూరు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అంతా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ కుమార్ రైతలను అప్రమత్తం చేశారు. వరి కోతలు చేయవద్దని, కోసిన వరి ఓవులు తడిచిపోకుండా భద్రపరుచుకోవాలన్నారు.


హిరమండలం: వరికుప్పలపై తార్పాలులు కప్పిన రైతులు


హిరమండలం ఆరబోసిన ధాన్యంపై తార్పాలులు కప్పి దృశ్యం


మెళియాపుట్టి: పట్టుపురంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి


మాట్లాడుతున్న మురళి

నరసన్నపేట: రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ ఆరంగి మురళీ అన్నారు. ఉర్లాం పీహెచ్‌సీ అభివృద్ధి సలహా సంఘ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యానికి.. ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆస్పత్రుల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించడం, మందులను సరఫరా చేస్తోందన్నారు. గతంతో పోల్చితే పీహెచ్‌సీలు ఎంతో సుందరంగా ఉన్నాయన్నారు. అన్ని స్థాయిల్లో సిబ్బందిని సైతం ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీలో ఉన్న రూ. 1.70 లక్షలు వినియోగానికి అనుమతినిస్తూ తీర్మానం చేశారు. ప్రహరీ నిర్మాణం చేయక పోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు వైద్యులు సుజాత, అరవింద్, ఇతర సిబ్బంది ఎంపీపీతో పాటు సమావేశానికి హాజరైన ఎంపీడీవో మధుసూదనరావు దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ నిచ్చారు. సమావేశంలో ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, సొసైటీ అధ్యక్షుడు దాలినాయుడు, అటవీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకూడదు

● నరసన్నపేట ఎమ్మెల్యే కృష్ణదాస్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు వేగవంతం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చిక్కాలవలస గ్రామంలోని ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలును శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించే ప్రతి గింజను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని రైతులు గమనించాలని అన్నారు. మద్దతు ధరతో పాటు కొనుగోలు కేంద్రం నుంచి మిల్లుకు వెళ్లేందుకు రవాణా, గోనె సంచె, హమాలీల కూలీ డబ్బులను కూడా రైతుకు ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆర్‌బీకేలకు విక్రయించాలని కోరారు. మధ్య దళారులకు విక్రయాలు చేస్తే రైతులు నష్టపోతారన్నారు. ఏడీ రవీంద్రభారతి మాట్లాడుతూ.. ఈక్రాప్ చేయించుకున్న ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తేమ శాతం సక్రమంగా ఉండాలన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి మాట్లాడుతూ.. మిల్లర్లు అదనంగా ధాన్యం రైతుల నుంచి తీసుకోకుండా చూడాలన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ ఎ.సింహాచలం, వ్యవసాయాధికారి కె.సునీత, సొసైటీ సీఈవో ఈశ్వరరావు, నాయకులు లుకలాపు రవి, ఎం.లక్ష్మునాయుడు, కింతలి చలపతిరావు, సడగాన రవి, పాపినాయుడు, పుట్టా ఆదిలక్ష్మి, ఆరంగి శ్రీను పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు


వ్రతాలు చేస్తున్న దంపతులు

సారవకోట: బుడితి గ్రామంలో కార్తీక శనివారాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. పీఏసీఎస్ ఆవరణలో ఆధ్యాత్మిక విజ్ఞానపీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో దంపతులచే వ్రతాలను నిర్వహించినట్లు నిర్వాహకులు మెండ సన్యాసిరావు, జాడ మోహనరావు తెలిపారు. ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేపడుతున్నామన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి జ్యోత్స్న

పొందూరు: ఈనెల తొమ్మిదో తేదీన స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంఘం అధ్యక్షుడు జస్టిస్ బి.జ్యోత్స్న కోరారు. ఈ మేరకు కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాలపై అదాలత్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్, భార్య, భర్తల తగాదా కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. లీగల్ అవేర్నెస్ కార్యక్రమం ద్వారా 185 ఎంవీ యాక్ట్ కేసులు, డ్రంకన్ డ్రైవన్ కేసులపై అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు.

సక్రమంగా ఓటర్ల నమోదు ప్రక్రియ


సరుబుజ్జిలి: ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ నవీన్


హిరమండలం: కిట్టాలపాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మురళీమోహన్

సరుబుజ్జిలి: ఓటర్ల నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సిబ్బందిని ఆదేశించారు. బూర్జ మండలం కొండపేటని 216 పోలింగ్ కేంద్రంలో నిర్వహిస్తున్న ఓటర్ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, మార్పుల గురించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రమణారావు ఉన్నారు.

ఓటు నమోదు ప్రక్రియ పరిశీలన

హిరమండలం: మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఓటు నమోదు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని తహసీల్దార్ బి.మురళీమోహన్ పరిశీలించారు. అక్కరాపల్లి, కిట్టాలపాడు 305, 309 పోలింగు కేంద్రాలను ఆయన సందర్శించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓటు హక్కు నమోదు వేగవంతం

ఆమదాలవలస రూరల్: ఓటు హక్కు నమోదు చేసుకునే యువతీ యువకుల ఓటు హక్కు దరఖాస్తులను నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. పొన్నాంపేట, దన్నానపేట పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. తహసీల్దార్ గణపతిరావు, ఎలక్షన్ డీటీ మురళీధర్ నాయక్, బీఎల్వోలు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న నోడల్ అధికారి ప్రసాదరావు

జలుమూరు: ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి ఎం.ప్రసాదరావు అన్నారు. శనివారం శ్రీముఖలింగంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు, చికిత్స, మందుల పంపిణీపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈయనతోపాటు మెడికల్ అధికారి సుజాత, డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్ కుమార్ ఉన్నారు.

సంక్షిప్తంగా...

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం


కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

హిరమండలం: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ అన్నారు. హిరమండలం సచివాలయం–2 పరిధిలోని 'ఈ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, ఉప సర్పంచ్ వెలమల బాలరాజు, సచివాలయ కన్వీనర్లు రాడ లక్ష్మీనారాయణ, జోగి శ్రీనివాసరావు, సైలాడ పాపారావు, సైలాడ రమేష్, తోణంగి మాధవరెడ్డి, పాలకొండ సింహాచలం, నరసింహులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

పాతపట్నం: కొనుగోలు చేసిన వస్తువుకు బిల్లులు తప్పనిసరిగా వినియోగదారుడు తీసుకోవాలని జిల్లా వినియోగదారుల పరిరక్షణ న్యాయమూర్తి ఆర్.చిరంజీవి అన్నారు. స్థానిక కోర్టు కూడలి వద్ద ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో వినియోగదారుల హక్కు–చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వస్తువులు కొన్నవెంటనే బిల్లులు తీసుకోవడం మన కర్తవ్యమన్నారు. ఫోరం వ్యవస్థాపకులు సాయిరమేష్ గౌడ్, చైర్మన్ బి.రామారావు, జాయింట్ సెక్రటరీ ఎస్.మధుబాబు, వైస్ చైర్మన్ ఎం.రామక్రిష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ అంజనేయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సచివాలయ సిబ్బంది శిక్షణ

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల నాలుగు నుంచి తొమ్మిదో తేదీ వరకు సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు పునరుత్తేజ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పి.జయంత్ ప్రసాద్ శనివారం తెలిపారు. నాలుగు నుంచి ఆరో తేదీ వరకు పెద్దలొగిడి, చంగుడి, ఆర్.ఎల్.పురం, రొంపివలస, తిడ్డిమి, సీది, గంగువాడ, బూరగాం, తెంబూరు, సింగుపురం, కాగువాడ సచివాలయం ఉద్యోగులకు, వలంటీర్లకు, ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు పాతపట్నం–1, 2, 3, బడ్డుమర్రి, కొరసవాడ, ఎ.ఎస్.కవిటి, తీమర గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

కుక్కలను నియంత్రించాలని వినతి

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేటలో వీధి కుక్కల బెడదను తగ్గించాలని స్థానిక సర్పంచ్ ముగడ దివాకర్ కోరారు. ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్, ఈఓపీఆర్డీ ఐ.పద్మజలకు శనివారం విజ్ఞప్తి చేశారు. పశువులపై తరచూ దాడి చేసి గాయపరుస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎల్.ఎన్.పేట: పండ్ల తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన విస్తరణ అధికారి (హెచ్ఈవో) తిరుపతిరావు అన్నారు. జోగివలస గ్రామంలో జీడి, మామిడి తోటలను శనివారం రైతులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం జీడి తోటలు చిగురు, పూత దశలో ఉన్నాయన్నారు. ఈ సమయంలో టీ దోమ, రసం పీల్చే పురుగు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. వీటి నివారణకు చేపట్టాల్సిన చర్యలు కోసం పండ్ల తోటల రైతులకు అవగాహన కలిగించారు.

పలాసలో జీఎన్ జ్యూయలర్స్ ప్రారంభం


బంగారు నగను పరిశీలిస్తున్న మంత్రి సీదిరి సతీమణి శ్రీదేవి, తదితరులు

కాశీబుగ్గ: ప్రముఖ నగల విక్రయ సంస్థ జీఎన్ జ్యూయలర్స్ నూతన షోరూమ్‌ను పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రారంభించింది. కాశీబుగ్గ బస్టాండ్‌కు సమీపంలో కేటీ రోడ్డులో నూతన షోరూం ప్రారంభోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై బంగారు విభాగాన్ని ప్రారంభించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బళ్ల గిరిబాబు వెండి విభాగాన్ని ప్రారంభించారు. తమ సంస్థ మూడో షోరూంను ఇక్కడ ఏర్పాటు చేశామని నరసన్నపేట పట్టణానికి చెందిన ప్రముఖ బంగారు వ్యాపారవేత్త గుడ్ల నారాయణరావు తెలిపారు. ఇక్కడ ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతులతో పాటు, లక్కీ డ్రాలో గెలిపొందిన వారికి ఎంత బంగారం కొంటే అంతే బంగారం ఉచితంగా ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.


జీఎన్ జ్యూయలర్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి సతీమణి సీదిరి శ్రీదేవి

పార్టీ బలోపేతానికి మరింత కృషి


పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే కృష్ణదాస్

● ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే కృష్ణదాస్

సారవకోట: రానున్న ఎన్నికలలో భారీ ఆధిక్యం సాధించేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు మరింత కృషి చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. అడ్డపనస గ్రామంలోని కల్యాణ మండపంలో జలుమూరు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతోందని.. 18 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కర్ని ఓటరుగా నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించేందుకు ప్రతీ ఒక్క కార్యకర్త, నాయకులు రోజుకు గంట పాటు పార్టీ కోసం కష్టపడాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీ సాధిస్తుందన్నారు. ప్రస్తుతం 51 శాతం ఓటర్లు పార్టీకి మద్దతుగా ఉన్నారని.. వారి శాతాన్ని మరింత పెంచాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికారిత సాధించేందుకు అన్ని కులాలు, మతాలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎవరి ప్రమేయం లేకుండా అర్హతే ప్రమాణికంగా అందజేస్తున్నారన్నారు. జలుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మెరుమాళ్ల భారతమ్మ, వైస్ చైర్మన్‌గా బొంగు కొండయ్య, డైరెక్టర్లుగా వాన గోవిందరావు, కూన జగన్నాయకులు, దండుపాటి రమణమ్మ, మామిడి రాజకుమారి, పొన్నాన హరిప్రసాద్, యజ్జల నీలవేణి, కళ్యాణం సుశీల, అనంతపల్లి భాను, రావాడ ఉమా, షేక్ యాకూబ్, ధర్మాన పద్మావతి, పంచిరెడ్డి సూర్యనారాయణ, వారణాశి కాంతారావుల చే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జలుమూరు, నరసన్నపేట ఎంపీపీలు వాన గోపి, ఆరంగి మురళీధర్, డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్, వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, చింతల వెంకటరమణ, తంగి మురళీకృష్ణ, వైఎస్సార్ పార్టీ నాయకులు వరుదు దేవీ ప్రసాద్, మొజ్జాడ శ్యామలరావు, గెల్లంకి వెంకటరావు, కనుసు సీతారాం, నక్క తులసీదాస్, పతివాడ గిరీశ్వరరావు, బొబ్బాది ఈశ్వరరావు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

నరసన్నపేట:

యువత ఓటు హక్కు పొందాలని కలెక్టర్ శ్రీ కేష్ బి.లాఠకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే చేర్పులు, మార్పులు కూడా చేసుకోవచ్చని అన్నారు. పూర్తి ఆధారాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓ పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకూ ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక శిబిరాల్లో బీఎల్‌ఓలు పాత్ర చాలా కీలకమని అన్నారు. వచ్చే దరఖాస్తులు 9వ తేదీ లోపు అప్‌లోడ్ చేయాలని బీఎల్‌ఓలకు ఆదేశించారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

టీడీపీ తప్పుడు ఫిర్యాదులపై విచారణ చేయాలి

ఎల్.ఎన్.పేట: తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఆర్.అప్పలరాజుకు శనివారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు టీడీపీ పన్నాగం పన్నిందన్నారు. అయితే దీన్ని కప్పిపుచ్చుకోవడానికి వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేస్తారనే అనుమానంగా ఉన్నవారిని గుర్తించి వారంతా ఊరిలో లేరని, మరణించారని, పెళ్లి జరిగి మరో ఊరిలో ఉన్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ వారి ఓట్లు తొలగించాలని ఫిర్యాదు చేయడం దురదృష్టకరమన్నారు. ఏమీ చేయలేని వారిని గుర్తించి వారి ఓట్లు తొలగించే కుట్ర టీడీపీ నాయకులు పన్నుతున్నారని ఆరోపించారు. ఓట్లు తొలగించే ముందు సమగ్ర విచారణ చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు, లక్ష్మీనర్సుపేట సర్పంచ్ ముగడ దివాకర్, పార్టీ నాయకులు రెడ్డి సీతారాం, ఎర్ర జనార్దన ఉన్నారు.